

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 21-04-2026 | సంపుటి - 27 | సంచిక -329 | రూ : 4 | పేజీలు: 8


## ఎట్లొస్తారో చూస్తాం..

- ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తాం
- వచ్చే ఎన్నికల్లో చూస్కుందాం
- ఔర్ ఏక్‌బార్ కాంగ్రెస్ సర్కార్
- ఎవరడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం
- భారీ మెజార్టీతో విజయం సాధిస్తాం
- ప్రజాపాలన ఎందుకు పోవాలో జీవన్‌రెడ్డే చెప్పాలి : రైతు ఉత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : 'వచ్చే ఎన్నికల్లో నువ్వో.. నేనో... తేల్చుకుందాం రా.. కేసీఆర్...' అంటూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. 'ప్రజాపాలన పోవాలి.. కేసీఆర్ రావాలి... అంటూ ఓ పెద్ద మనిషి అంటున్నారు...మా పాలన ఎందుకు పోవాలి? పాపాల భైరవుడి లాంటి కేసీఆర్ ఎందుకు రావాలో ఆయనే చెప్పాలి...' అని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని ఉద్దేశించి సీఎం ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రతిపక్షహోదా కూడా ఊడగొట్టకపోతే తన పేరు మార్చు **తరువాయి 2లో**





## మళ్లీ అధికారం మాదే

- రాగానే హైడ్రా ఎత్తేస్తాం
- తెలంగాణ పునర్నిర్మాణానికి మరో యజ్ఞం
- రెండేండ్లలో అన్ని రంగాల్లో అధ్వానం
- బీఆర్ఎస్‌లో చేరిన జీవన్‌రెడ్డి 2లో
- పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామకం
- జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభ నుంచే యుద్ధం : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



### రాజస్తాన్‌లోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో
## భారీ అగ్నిప్రమాదం

- ప్రధాని మోడీ ప్రారంభానికి ఒకరోజు ముందు ఘటన
- ప్రాణనష్టం జరగలేదని అధికారుల వెల్లడి

జైపూర్: ప్రధాని మోడీ చేతుల మీదుగా నేడు (ఏప్రిల్ 21) ప్రారంభం కావాల్సిన రాజస్తాన్‌లోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో ఆ ప్రాంతాన్ని పొగ కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది పెద్ద **తరువాయి 2లో**





## గల్ఫ్‌కు చేదు అనుభవం

- దెబ్బతిన్న అమెరికా రక్షణ కవచం తుస్సుమన్న థాడ్ వ్యవస్థలు
- ఇరాన్ దాడులను అడ్డుకోవడంలో వైఫల్యం
- వాటి కోసం అగ్రరాజ్యానికి 142 బిలియన్ డాలర్లు ముట్టచెప్పిన మధ్యప్రాచ్య దేశాలు 2లో

### మనది
## అయోధ్య బంధం

- దక్షిణ కొరియా అధ్యక్షుడితో ప్రధాని మోదీ 2లో



### ప్రతి పరీక్షను
## ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకోండి

- మేడిగడ్డ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- బ్యారేజీని సందర్శించిన ముఖ్యమంత్రి
- ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని సూచన
- నవంబరు ఆఖరునాటికి డిజైన్లకు సీడబ్ల్యూసీ ఆమోదం: అధికారులు 2లో





## దక్షిణాది వాదన చెల్లదా..!

- చాలా ఉత్తరాది రాష్ట్రాల్లోనూ తగ్గిన జనణాలు
- కేంద్ర హోంశాఖ టీఎఫ్ఆర్ లెక్కలే ఉదాహరణ 2లో

# ప్రతి పరీక్షను ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకోండి

మేడిగడ్డ: మేడిగడ్డ బ్యారేజీ వద్ద చేసే ప్రతి పరీక్షను ఒకటికి రెండుసార్లు నిర్ధారణ చేసుకొని ముందడుగు వేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు ఇంజినీర్లు, నిర్మాణ సంస్థలు, పరీక్షలు చేస్తున్న ఏజెన్సీలకు సూచించారు. బ్యారేజీ పునరుద్ధరణలో భాగంగా జరుగుతున్న పలు రకాల పరీక్షలను సీఎం సోమవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. తొలుత ఆయన బ్యారేజీ వద్ద కుంగిన ఏడవ బ్లాక్‌లోని పియర్స్ 20,21,22 వద్ద రిగ్గుల ద్వారా బోర్‌హోల్ డేటా కోసం జరుగుతున్న పనులు, జియోటెక్నికల్, జియోఫిజికల్, జీపీఆర్ పరీక్షల కోసం సేకరించిన నమూనాలను పరిశీలించారు. వీటిని పుణెలోని సెంటర్ ఫర్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సంస్థకు పంపుతామని, ల్యాబ్‌లో పరిశీలన అనంతరం బ్యారేజీ డ్యామేజీపై స్పష్టత వస్తుందని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఛైర్మన్ అనిల్ జైన్, ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్త సత్యనారాయణ, బ్యారేజీల పునరుద్ధరణ పనులకోసం ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ పరీక్షిత్ మెహ్రా, ఈఎన్సీ రమేశ్‌బాబు తదితరులు సీఎంకు వివరించారు. డ్రోన్ బేస్డ్ జీపీఆర్ పరీక్షకు సంబంధించి వివరాలు సీఎంకు చెబుతూ ఈ పరీక్ష ద్వారా 20 నుంచి 30 మీటర్ల లోతు వరకు పియర్స్ వద్ద నేల స్వభావాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. డ్రోన్ పనితీరును ప్రయోగాత్మకంగా వివరించారు. సీకెంట్ పైల్స్‌కు సంబంధించి సమాంతర క్రాస్‌హోల్ సెస్మిక్ టెస్ట్ వివరాలను ముఖ్యమంత్రి తెలుసుకొన్నారు. ప్రతి సందర్భంలోనూ పరీక్షల కచ్చితత్వం ఎంత అని రేవంత్ ఆరా తీశారు.

**సమస్యను అర్థం చేసుకోవడమే సగం పరిష్కారం**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లోపాలపై ఎలా ముందుకెళ్లాలో స్పష్టత వచ్చిందని, సమస్యను అర్థం చేసుకోవడమే సగం పరిష్కారమని అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సేకరించిన నమూనాలతో వచ్చిన ఫలితాల ఆధారంగానే పనులు చేయాలని, ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని, ప్రతిపనికి వారి ఆమోదం ఉండాలని సూచించారు. ఎన్డీఎస్ఏ సిఫార్సులు, ఇప్పటివరకు చేసిన పరీక్షలు, మిగిలినవి ఏ దశలో ఉన్నాయో అధికారులు వివరించగా.. పూర్తి చేయడానికి ఏ పరీక్షకు ఎంత సమయం పడుతుంది?ఎన్ని బోర్లు బ్యారేజీల వద్దకు తరలించారు తదితర వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే రిగ్గులు బ్యారేజీల వద్దకు వచ్చాయని, ఈ నెలాఖరుకు 100 రిగ్గులు పని చేస్తాయని అధికారులు వివరించారు. మేడిగడ్డ బ్యారేజీ జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలు మే ఆఖరుకు పూర్తవుతాయని, జూన్ 15 కల్లా సీడబ్ల్యూపీఆర్ఎస్ ఫలితాలు వస్తాయని, వెంటనే డిజైన్ల పని ప్రారంభించి అక్టోబరు ఆఖరుకల్లా పూర్తి చేస్తామని వివరించారు. హైడ్రాలిక్ 2డి మోడల్ స్టడీస్ నవంబరు 15 కల్లా పూర్తవుతాయని, నవంబరు ఆఖరు కల్లా డిజైన్లను సీడబ్ల్యూసీ ఆమోదించడంతో సహా అన్నీ పూర్తయి చేయాల్సిన పనులపై స్పష్టత వస్తుందని అధికారులు వివరించారు. సీకెంట్ పైల్స్ దెబ్బతిన్నాయని, అనివార్యంగా వాటిని మార్చాల్సి ఉంటుందని డిజైనర్ కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధి పేర్కొనగా, పరీక్షలు పూర్తి చేయకుండానే ఎలా నిర్ధారణకు వచ్చారని, సగం సగం చేయవద్దని ముఖ్యమంత్రి సూచించారు. 2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ కుంగి ఏడవ బ్లాక్ పియర్స్‌లో భారీ పగుళ్లు ఏర్పడినప్పటి నుంచి జరిగిన పరిణామాలను అధికారులు సీఎంకు వివరించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మరింత వేగంగా పనులు చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మాణ సంస్థలు పూర్తిగా సహకరించడం లేదని, ఒప్పందంలో లేనివి చేయాల్సి వస్తే ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని, పరీక్షల్లో లోపాలు గుర్తిస్తే అవసరమైన చర్యలు తీసుకోవడానికి మాత్రం వెనుకాడబోమని స్పష్టం చేశారు. పరీక్షల వేగాన్ని మరింత పెంచాలని ఎన్డీఎస్ఏ ఛైర్మన్ అనిల్ జైన్ సూచించినట్లు తెలిసింది. మేడిగడ్డ బ్యారేజీ పరిశీలన, సమీక్షలో... మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, మూడు బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధులు ఉన్నారు. ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసగుప్తా, నీటిపారుదల శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, కన్సల్టెంట్ యాదగిరిలు కూడా పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.

# మనది అయోధ్య బంధం

ఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో భేటీ అయ్యారు. అనంతరం సంయుక్త విలేకరుల సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాల గురించి మాట్లాడుతూ, ఓ సుందరమైన ప్రేమ కథనూ ప్రస్తావించారు. అయోధ్య యువరాణి సురిరత్న, కొరియా రాజు కిమ్ సురోల మధ్య రెండు వేల ఏళ్ల క్రితం ఉదయించిన ప్రేమ, పరిణయం గురించి చెబుతూ.. దక్షిణ కొరియాతో బంధం ఈనాటిది కాదని అన్నారు. భారత ప్రభుత్వ వెబ్‌సైట్ 'ఇంక్రెడిబుల్ ఇండియా'లో కూడా ఈ ప్రేమ కథ గురించి వివరంగా ఉంది. అయోధ్య యువరాణి సురిరత్నను.. కొరియాలో రాణి హేయో హాంగ్‌ఓక్ అని పిలుస్తారు. 2021లో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, దక్షిణ కొరియాలోని గిమ్హే నగరం కలిపి ఆ రాణి స్మారక చిహ్నాన్ని సరయూ నది తీరంలో నిర్మించాయి.

* కొరియాలోని 'సంగుక్ యుసా' అనే పురాతన గ్రంథం ప్రకారం.. దాదాపు రెండు వేల ఏళ్ల క్రితం అయోధ్య యువరాణి సురిరత్న, సముద్ర ప్రయాణం చేసి కొరియా చేరుకుని, అక్కడ రాజు కిమ్ సురోను వివాహం చేసుకున్నారు.
* కొరియాకు చెందిన కారక్ వంశీయులు ఇప్పటికీ తమను ఈ రాణి వారసులుగానే భావిస్తారు. అందుకే ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో కొరియన్లు అయోధ్యలోని సరయూ నది తీరాన ఉన్న ఆమె స్మారక చిహ్నాన్ని సందర్శిస్తుంటారు.
* సోమవారం అధినేతలు లీ జే మ్యుంగ్, మోదీ చర్చల అనంతరం పారిశ్రామిక సహకారం, ఉక్కు సరఫరా గొలుసు తదితర రంగాల్లో ఇరు దేశాలు 15 ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ద్వైపాక్షిక వాణిజ్య విలువను 2030 కల్లా 50 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిర్ణయించాయి.

# మళ్లీ అధికారం మాదే

హైదరాబాద్ : తెలంగాణ పునర్నిర్మాణానికి మరో యజ్ఞం అవసరమని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేండ్లలోనే అన్ని రంగాలు అధ్వాన్న స్థితిలోకి వెళ్లిపోయాయని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే తొలివేటు హైడ్రాపైనే అని స్పష్టం చేశారు. జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభ నుంచే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం మొదలుపెడుతున్నట్టు ఆయన ప్రకటించారు. సోమవారం జగిత్యాలలో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు కేసీఆర్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాజకీయ ప్రత్యర్థులుగా తాము దశాబ్దాలుగా ఉన్నా తమ మధ్య స్నేహం కొనసాగుతూనే ఉందని కేసీఆర్ తెలిపారు.

**కాంగ్రెస్, టిడీపీ తియ్యటి, పుల్లటి మాటలు**

గతంలో తెలంగాణ పదంపై అసెంబ్లీలో సైతం నిషేధం విధించిన సమయంలో, ఇక్కడి ప్రజల పట్ల, మాట్లాడే భాష, బతుకు, నీళ్లు, ఉద్యోగాలు వనరుల మీద వివక్ష ఉండేదని కేసీఆర్ గుర్తుచేశారు. ఎస్సారెస్పీ కాలువ ఉన్న ప్రాంతం మొదలు మహబూబ్ నగర్ వరకు యువత ఉపాధి కోసం వలసలకు వెళితే పల్లెల్లో వృద్ధులే మిగిలిన పరిస్థితి ఆనాడు ఉండేదన్నారు. చేసిందేమి లేకున్నా నాడు పాలించిన కాంగ్రెస్, టీడీపీలు తియ్యటి, పుల్లటి మాటలు చెబుతూ ప్రజలను కట్టు బానిసలుగా మార్చాయన్నారు. నాటి సీఎం చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలు పెంచితే దానికి వ్యతిరేకంగా తాను లేఖ రాశాననీ, కొంత మంది రైతులు వ్యతిరేకిస్తే హైదరాబాద్ బషీర్ బాగ్‌లో కాల్పులు జరిపి ముగ్గురిని చంపేశారని తెలిపారు. దాంతో తెలంగాణ సమస్యలకు పరిష్కారం ప్రత్యేక రాష్ట్రమే అని తాను నిర్ణయించుకున్నాననీ, ఒక్కడిగా బయలుదేరానని తెలిపారు. తెలంగాణ కోసం కాంగ్రెస్ పార్టీతో జతకడితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాడు తెలంగాణను ఎగబెట్టే ఆలోచనతో జాప్యం చేసిందని కేసీఆర్ తెలిపారు. మాజీ సీఎం రోశయ్య 14ఎఫ్ తీసుకొస్తే దానికి వ్యతిరేకంగా కేసీఆర్ చచ్చుడో...తెలంగాణ వచ్చుడో అంటూ ఆమరణ నిరాహారదీక్షకు కూర్చుంటే అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరం తెలంగాణ ప్రకటన చేశారని గుర్తుచేశారు. ఆంధ్ర ప్రజా ప్రతినిధుల రాజీనామాల బెదిరింపులతో కేంద్రం వెనక్కి తగ్గితే మళ్లీ జేఏసీ పెట్టి మూడున్నరేండ్లు ఉధృతంగా ఉద్యమం చేసి తెలంగాణ సాధించినట్టు తెలిపారు. 2014లో వచ్చిన తెలంగాణలో ప్రజలు ఆశీర్వదించి అధికారమిస్తే ప్రజల జీవితాల్లో మార్పు కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు కేసీఆర్ తెలిపారు. మిషన్ భగీరథతో అన్ని వర్గాల ప్రజలకు తాగునీరు, తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తిని 7 వేల నుంచి 20 వేల మెగావాట్లకు పెంచి 24గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశామని చెప్పారు. రైతుబంధు, దళిత బంధు తదితర పథకాలను అందుబాటులోకి తెచ్చినట్టు వివరించారు. బీఆర్ఎస్ ను ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీ అర్రాస్ పాట పాడినట్టు 6 గ్యారంటీలు, 420 హామీలంటూ అన్ని వర్గాల ప్రజలను వంచించిందని కేసీఆర్ దుయ్యబట్టారు. రైతులు పొలాలు ఎండిపోతున్నాయి, కనీసం సమయానికి యూరియా కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ ఏమైంది? అని ప్రశ్నించారు. నోటికొచ్చిన మాటలు అమలుకాని హామీలతో కాంగ్రెస్ ఊదరగొట్టినా బీఆర్ఎస్ 1.7 శాతం స్వల్ప ఓట్లతో ఓడిపోయిందని తెలిపారు. కొత్త ప్రభుత్వానికి పని చేసేందుకు అవకాశమివ్వాలనీ వేచి చూస్తే, చిల్లర మాటలు తప్ప నిర్మాణాత్మక కార్యక్రమం ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. పొదరిల్లులాగా తెలంగాణను మార్చి కడుపులో సల్ల కదలకుండా రైతులు బాగుండేలా చేసి అప్పగిస్తే యూరియా ఇవ్వడం చాతగానిది కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎందుకు దిగజారింది? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్, రైతుల భూముల ధరలు తగ్గాయనీ, మక్కలు కొనకుండా బోనస్ అంటూ బోగస్ మాటలు మాట్లాడుతున్నారనీ, చేనేత కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయని విమర్శించారు. "పొద్దున లేస్తే కేసీఆర్ చావాలని అంటున్నావ్. నువ్వు ఎంత మొత్తుకున్నా కేసీఆర్ చావడు...." అని కాంగ్రెస్ నేతల విమర్శలపై స్పందించారు. ఉద్యోగులకు 72 శాతం పీఆర్సీని బీఆర్ఎస్ ఇస్తే, ఉద్యోగులు తాము పొదుపు చేసుకున్న డబ్బులను కూడా రిటైర్మెంట్ తర్వాత కాంగ్రెస్ సర్కార్ ఇవ్వడం లేదని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయెంబర్స్ మెంట్ పథకాన్ని తాము కొనసాగిస్తే వాటికి బకాయిలు పెట్టి విద్యార్థులను వేధిస్తున్నదని విమర్శించారు. స్కాంలతో సింగరేణిని నాశనం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో మున్సిపాల్టీలు మురికికూపాలుగా మారాయని దుయ్యబట్టారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగానే పూర్తి చేయడం లేదన్నారు. సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్టు కేసీఆర్ ప్రకటించారు. జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు విద్యాసాగర్ రావు సభాధ్యక్షత వహించిన సభలో మండలి విపక్ష నేత మధుసూధనా చారి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఎల్ రమణ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎట్లొస్తారో చూస్తాం..

హైదరాబాద్ : 'వచ్చే ఎన్నికల్లో నువ్వో.. నేనో... తేల్చుకుందాం రా.. కేసీఆర్...' అంటూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. 'ప్రజాపాలన పోవాలి.. కేసీఆర్ రావాలి... అంటూ ఓ పెద్ద మనిషి అంటున్నారు...మా పాలన ఎందుకు పోవాలి? పాపాల భైరవుడి లాంటి కేసీఆర్ ఎందుకు రావాలో ఆయనే చెప్పాలి...' అని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని ఉద్దేశించి సీఎం ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రతిపక్షహోదా కూడా ఊడగొట్టకపోతే తన పేరు మార్చుకుంటానంటూ ఆయన శపథం చేశారు. ఔర్ ఏక్‌బార్ కాంగ్రెస్ సర్కార్ అంటూ నినదించారు. ఎవరడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం...భారీ మెజార్టీతో మువ్వన్నెల జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూరిపల్లిలో నిర్వహించిన 'ప్రజాపాలనరైతు ఉత్సవాల' బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. సభావేదిక నుంచి రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పైనా, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆనాడు డీఎస్, వైఎస్ జోడెద్దుల్లా పని చేసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. అదే మాదిరిగా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటు కార్యకర్తల సహకారంతో తాను రెండోసారి పార్టీని అధికారంలోకి తీసుకొస్తానని వ్యాఖ్యానించారు. తద్వారా చరిత్రను తిరగరాస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ ఓటమి తప్పదని, అది జగిత్యాలతోనే ప్రారంభమవుతుందని హెచ్చరించారు. ఉప ఎన్నికలు, సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటిందని గుర్తు చేశారు. చివరికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం కేసీఆర్‌కు ఘోరీ కట్టామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ ఘోరీ మీద కాంగ్రెస్ జెండాను ఎగరేస్తామని హెచ్చరించారు. లక్షలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్ జెండా మోస్తే.. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని సీఎం ఈ సందర్భంగా చెప్పారు. పార్టీ మారిన జీవన్‌రెడ్డి చరిత్రతోపాటు ఆయన వెనకున్న మచ్చలన్నీ తనకు తెలుసునని ఎద్దేవా చేశారు. 40 ఏండ్లపాటు ఆయన కాంగ్రెస్ నుంచి తన కుటుంబానికి ఎన్నో పదవులు ఇచ్చుకున్నారని గుర్తు చేశారు.

# గల్ఫ్‌కు చేదు అనుభవం

ఇరాన్ ఆయుధ శక్తిని ఎదుర్కోవడానికి అమెరికా ప్రభుత్వం క్షిపణి రక్షణ వ్యవస్థలను రూపొందించింది. వీటి కోసం గల్ఫ్ దేశాలు బిలియన్ల కొద్దీ నిధులను... ఏకంగా 142 బిలియన్ డాలర్లను కుమ్మరించాయి. కానీ జరిగిందేమిటి? ఇరాన్ ప్రతీకార దాడులకు దిగినప్పుడు వాటి పరిమాణం, వ్యయ అసమానతలు అంచనాలను తలకిందులు చేశాయి. మధ్యప్రాచ్యంలోని గల్ఫ్ దేశాలకు మిగిలింది కాలిపోయిన థాడ్ వ్యవస్థలు, ఖరీదైన గుణపాఠం మాత్రమే. గల్ఫ్ దేశాలకు అమెరికా ఇస్తానని చెప్పిన భద్రతా వ్యవస్థలలో ప్రధానమైనది లాక్‌హీడ్ మార్టిన్‌కు చెందిన టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్ (థాడ్). దీనితో పాటు పేట్రియాట్ పీఏసీ3 బ్యాటరీలు కూడా ఉన్నాయి. అమెరికాలో ప్రభుత్వ ప్రాధాన్యతలను నిర్దేశించేది రక్షణ సంస్థలే కాబట్టి ఈ వ్యవస్థలు అత్యున్నత ప్రమాణాలతో కూడుకున్నవంటూ ఊదర కొట్టారు. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లను ఈ వ్యవస్థలు సమర్థవంతంగా తిప్పికొడతాయని నమ్మించారు. ట్యాంకర్లతో యుద్ధం చేసే కాలం నాటి నుంచి క్షిపణుల నుంచి పొంచి ఉన్న ముప్పును ఈ వ్యవస్థలు తొలగిస్తాయని నమ్మిన గల్ఫ్ దేశాలు అనేక సంవత్సరాలుగా వాటిపై అనేక బిలియన్ డాలర్లు వెచ్చిస్తున్నాయి.

**టెహ్రాన్ దాడులతో కకావికలం**

జోర్డార్, సౌదీ అరేబియా, యూఏఈలలోని థాడ్ రాడార్లపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు నేరుగా దాడి చేయగలిగాయి. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరం తగలబడిపోయింది. జోర్డాన్‌లోని మువాఫక్ వైమానిక స్థావరంలో ఉన్న రాడార్ ప్రదేశంలో శకలాలు మాత్రమే మిగిలాయి. యుఏఈలోని అల్ రువాయిస్ సమీపంలో ఉన్న థాడ్ బ్యాటరీపై పలు దఫాలుగా దాడి జరిగింది. ఇరాన్ వైపు నుంచి వచ్చిన పలు ఆయుధాలను అడ్డుకోవడంలో పాట్రియట్ వ్యవస్థలు ఆపసోపాలు పడ్డాయి. వీటిలో కొన్నింటిని మాత్రమే ఆ వ్యవస్థలు అడ్డుకోగలిగాయి.

# రాజస్తాన్‌లోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం

జైపూర్: ప్రధాని మోడీ చేతుల మీదుగా నేడు (ఏప్రిల్ 21) ప్రారంభం కావాల్సిన రాజస్తాన్‌లోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో ఆ ప్రాంతాన్ని పొగ కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం రిఫైనరీలోని క్రూడ్ డిస్టిలేషన్ యూనిట్‌లో భారీగా మంటలు చెలరేగాయి. మంగళవారం ప్రధాని మోడీ అక్కడ పర్యటించి రిఫైనరీని ప్రారంభించాల్సి ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ కూడా సోమవారం సాయంత్రం రిఫైనరీని సందర్శించనున్నారని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని, అగ్నిప్రమాదం వల్ల జరిగిన నష్టంపై అంచనా వేస్తున్నామని అధికారులు వెల్లడించారు. ప్రమాదంపై మాజీ సీఎం అశోక్ గెహ్లోత్ ఆందోళన రిఫైనరీలో జరిగిన అగ్నిప్రమాదంపై మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రిఫైనరీ రాజస్తానీయులందరికీ గర్వకారణమైన ప్రాజెక్ట్ అని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఈ ప్రాజెక్ట్‌ను ప్రధాని మోడీ ప్రారంభించనున్న తరుణంలో ప్రమాదం జరగడం అత్యంత దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారందరూ సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

*** 2013లోనే ఈ రిఫైనరీకి సోనియాగాంధీ శంకుస్థాపన**

రాజస్తాన్‌లో అశోక్‌గహ్లోత్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 2013లో సోనియాగాంధీ ఈ రిఫైనరీకి శంకుస్థాపన చేశారు. బలోత్రాలోని ఈ రిఫైనరీని దేశపు తొలి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీకమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దారు. హిందుస్థాన్ పెట్రోలియం, రాజస్తాన్ ప్రభుత్వం మధ్య జాయింట్ వెంచర్‌గా ఇది ఏర్పాటైంది. అప్పుడు ప్రాజెక్ట్ వ్యయం రూ.43,129కోట్లు. అనంతరం జనవరి 16, 2018లో నరేంద్ర మోడీ ప్రభుత్వం దీనిని రీలాంచ్ చేసింది. ఈ మొత్తాన్ని రూ.79,459 కోట్లకు సవరించి ఈ ప్రాజెక్ట్ చేపట్టారు.

*** దేశంలోని అతిపెద్ద అనుసంధానిత రిఫైనరీ**

4,400 ఎకరాల్లో విస్తరించిన ఈ రిఫైనరీలో ఇంధనంతో పాటు భారీగా పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయారు చేస్తుంది. ప్లాస్టిక్, వ్యవసాయ పైపులు, ప్యాకేజింగ్ ఫిల్మ్‌లు, ఆటో విడిభాగాలు, సింథటిక్ ఫైబర్, వైద్య పరికరాలు, పెయింట్లు, డిటర్జెంట్ల తయారీకి ఇక్కడ తయారయ్యే పెట్రోకెమికల్స్ ఉపయోగపడతాయి. ఇది అందుబాటులోకి వస్తే దేశంలోని అతిపెద్ద అనుసంధానిత రిఫైనరీ పెట్రో రసాయనాల కాంప్లెక్స్‌ల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు మొత్తం వార్షిక సామర్థ్యం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు కాగా ఇందులో పెట్రోరసాయనాల ఉత్పత్తుల సామర్థ్యం 2.4 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉంది.

**ప్రధాని మోడీ పర్యటనకు సన్నాహాలు**

ఇదిలా ఉండగా ప్రధాని మోడీ బచ్‌పద్రలో రిఫైనరీని ప్రారంభించి బహిరంగ సభలో ప్రసంగించనున్న నేపథ్యంలో అధికారులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ముగ్గురు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్స్ (డీఐజీలు), 12 మంది సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీలు), సుమారు 5,000 మంది పోలీస్ సిబ్బందిని మోహరించనున్నారు.

*** వేదిక వద్ద 100కు పైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు**

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు సౌకర్యవంతంగా ఉండేందుకు విస్తృత ఏర్పాట్లు చేశామని జోధ్‌పూర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ) సత్యేంద్ర సింగ్ తెలిపారు. ॥వివిధ జిల్లాలను కలుపుతూ ఆరు వేర్వేరు మార్గాల్లో పార్కింగ్ సౌకర్యాలు కల్పించాం. వాహనాల రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ మళ్లింపులు కూడా అమలు చేశాం॥ అని ఆయన అన్నారు. కార్యక్రమ వేదిక వద్ద కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు 100కుపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు ఐజీపీ సత్యేంద్ర సింగ్ తెలిపారు. అయితే రిఫైనరీ దగ్ధమవటంతో..మోడీ బహిరంగసభకు పరిమితమవుతారా..? రిఫైనరీ సందర్శిస్తారా..? అన్నదానిపై చర్చనడుస్తోంది.

# దక్షిణాది వాదన చెల్లదా..!

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహించిన జనాభా నియంత్రణ విధానాన్ని దక్షిణాది ప్రజలు క్రమశిక్షణతో అమలు చేసినందున అక్కడ జనాభా తగ్గిపోయిందని, అందువల్ల జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సీట్లను కేటాయించొద్దని ఆయా రాష్ట్రాలు చేస్తున్న వాదనలతో కేంద్ర హోంశాఖ వార్షిక గణాంకాలు విభేదిస్తున్నాయి. తమ రాష్ట్రాల్లో సంతాన సాఫల్య నిష్పత్తి (టీఎఫ్ఆర్) ఉత్తరాదికంటే ఎక్కువగా పడిపోయినందున ఇక్కడ జనాభా తగ్గిపోతోందని, 1971 జనాభా నిష్పత్తి ఆధారంగానే సీట్లు కేటాయించాలని దక్షిణాది పార్టీల నేతలు, ప్రధానంగా ముఖ్యమంత్రులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. హోంశాఖ నివేదికను పరిశీలిస్తే దక్షిణాదితోపాటు, చాలా ఉత్తరాది రాష్ట్రాల్లోనూ టీఎఫ్ఆర్.. జాతీయ సగటు కంటే పడిపోయింది. 2020 లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల సగటు టీఎఫ్ఆర్ 2కి పరిమితంకాగా, అందులో 12 రాష్ట్రాల టీఎఫ్ఆర్ అంతకంటే తక్కువగా నమోదైనట్లు 202425 వార్షిక నివేదిక పేర్కొంది. వాటిలో 3 రాష్ట్రాల టీఎఫ్ఆర్ 1.4, ఆరు రాష్ట్రాల టీఎఫ్ఆర్ 1.5 వద్ద నమోదైంది.

# మంచినీటి సమస్యను పరిష్కరించండి

**పాపిరెడ్డి నగర్ అధ్యక్షులు చంద్రారెడ్డి**




శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని బ్లాక్.. సి, రోడ్ నెం.5లో నెలకొని ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని బస్తి అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి సోమవారం జలమండలిలో జరుగుతున్న ప్రజాపాలనలో భాగంగా డిజిఎం శ్రీనివాస్ రాజును కలిసి వినతిపత్రాన్ని అందిస్తూ విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై ఇప్పటికే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కి వినతినందించమని ,ఆయన అదేశాలమేరకు సోమవారం జలమండలి ప్రజావాణిలో వినతినందించినట్లు చంద్రారెడ్డి తెలిపారు. సమస్య పరిష్కరించేందుకు జలమండలి అధికారులు సానుకూలంగా స్పందించినట్లు చంద్రారెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అనిల్ , పాపిరెడ్డి నగర్ వాసులు వనం ఆంజనేయులు, భాస్కర్ గుప్తా, రమేష్, ఏ. చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# ఎండలు.. వానలు.. తెలంగాణలో విభిన్న వాతావరణం



హైదరాబాద్: తెలంగాణలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు ఎండలు ఠారెత్తిస్తుండగా.. మరోవైపు అకాల వర్షాలతో వరుణుడు దోబూచులాడుతున్నాడు. సోమ, మంగళవారాల్లో ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు ద్రోణి, క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, హైదరాబాద్‌తోపాటు మెదక్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల వడగళ్ల వాన కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. వర్షాల వల్ల ఉష్ణోగ్రతలు, ఉక్కపోతల్లో పెద్దగా మార్పు ఉండబోదని వాతావరణశాఖ స్పష్టం చేసింది.


# గచ్చిబౌలి పరిధిలోని అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం



హైదరాబాద్: గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధి టీఎన్జీవో కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దట్టమైన పొగ అలముకోవడంతో ఊపిరాడక అపార్ట్‌మెంట్ వాసులు ఇబ్బంది పడ్డారు. పై అంతస్తులో చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. వీరిలో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించారు. బిల్డింగ్ సెల్లార్‌లో షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలుస్తోంది. ఈ ఘటనలో 15 ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి.

# ఏ ముఖం పెట్టుకుని మళ్లీ అధికారంలోకి వస్తామంటున్నారు?

**: మంత్రి తుమ్మల**



ఖమ్మం: అధికారం పోయిన ఆందోళన, ఆక్రోశం బీఆర్ఎస్ నేతల్లో ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అందుకే కాంగ్రెస్ హామీలు అమలు చేయలేదని స్టీరియో రికార్డు వినిపిస్తున్నారని విమర్శించారు. ఆరోపణలతో ఆ పార్టీ నేతల బతుకు బజారుపాలవుతోందని ఎద్దేవా చేశారు. ఖమ్మంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. "అవినీతి వల్లే బీఆర్ఎస్ అస్థిత్వం, అధికారం పోయాయి. గత ప్రభుత్వ హయాంలో పంపులు, పైపుల కోసం కమీషన్లు దండుకున్నారు. కేంద్రం అనుమతి లేకుండా రూ.8 వేల కోట్లు ఖర్చుపెట్టారు. భారీగా ఖర్చు పెట్టినా.. ఎక్కడా ఒక ఎకరానికి నీళ్లు రాలేదు. ఏ ముఖం పెట్టుకుని మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారు" "బీఆర్ఎస్‌లో తగిన ప్రాధాన్యం లేక హరీశ్ రావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. భూకబ్జాలపై నీతులు చెప్పే హరీశ్.. నిన్న మీటింగ్ పెట్టింది కబ్జా కోరుల స్థలంలోనే. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడ్డ హరీశ్.. కాంగ్రెస్‌కు నీతులు చెబుతున్నారు. మీ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో సీతారామ ప్రాజెక్టు గురించి మీరు గొప్పగా చెబుతున్నారు. మీ పాలనలో నిలిచిన సీతారామ ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పూర్తి చేస్తున్నాం" అని తుమ్మల అన్నారు.

# దిల్లీకి బీఆర్ఎస్ పార్టీ త్రిసభ్య కమిటీ

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ త్రిసభ్య కమిటీ దిల్లీ పర్యటనకు వెళ్లింది. ఈ ప్రతినిధుల బృందంలో మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. ఏప్రిల్ 22న తెలంగాణ హైకోర్టులో కాళేశ్వరం కమిషన్‌పై తుది తీర్పు వెలువడనుంది. అలాగే ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన కార్యాచరణను సిద్ధం చేసేందుకు వీరి దిల్లీ పర్యటనకు వెళ్లారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో ఈ కమిటీ ప్రత్యేకంగా సమావేశమైంది. కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలపై.. అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై లాయర్లతో చర్చిస్తున్నారు.

# ఇందిరానగర్ కాలనీలో డాక్టర్ వాటర్ ప్లాంట్ ని కాళీ చేయించండి



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : బోడుప్పల్ సర్కిల్ 10వ, డివిజన్లో ఇందిరానగర్ కాలనీలో డాక్టర్ వాటర్ ప్లాంట్ ని లీజు గడువు ముగిసినందున డాక్టర్ వాటర్ ప్లాంట్ ని ఖాళీ చేయించి ఆ స్థలాన్ని కాలనీ ప్రయోజనాలకు ఉపయోగించ వలసిందిగా కాలనీలో వివిధ పార్టీ నాయకులు డిప్యూటీ కమిషనర్ శైలజ ని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ ఇందిరా నగర్ కాలనీ లో సంక్షేమ సంఘం స్థలాన్ని సుమారు 18 సంవత్సరాల క్రితం డాక్టర్ వాటర్ ప్లాంట్ కు లీజుకు ఇవ్వడం జరిగినది. ప్రస్తుతం ఈ లీజు గడువు పూర్తి అయినప్పటికీ సంబంధిత వారు ఇప్పటికీ అదే స్థలంలో డాక్టర్ వాటర్ ప్లాంట్ ని యధావిధిగా కొనసాగిస్తున్నారు. దీని వలన మా కాలనీ ప్రజలకు అసౌకర్యం కలుగుతున్నదన్నారు. సంక్షేమ సంఘం కార్యకలాపాలకు స్థలం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దయచేసి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి డాక్టర్ వాటర్ ప్లాంట్ ని వెంటనే ఖాళీ చేయించి ఆ స్థలాన్ని సంక్షేమ సంఘంగానికి స్థలాన్ని మాకు తిరిగి అప్పగించవలసిందిగా కాలనీవాసులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ సభ్యులు సాయిని అమృతం, మాజీ కో ఆప్షన్ సభ్యులు బత్తుల సుగుణ, సత్యనారాయణ, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్, మహాజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ బిక్షపతి, కాలనీవాసులు ఏ రాములు, మంగ నరసింహ, కె నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: మొక్కజొన్న రైతులకు మద్దతు ధర కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవడమే ప్రధాన లక్ష్యమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సరైన ధర కల్పించాలనే ఉద్దేశంతో నియోజకవర్గ పరిధిలో రెండు కేంద్రాల ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని తెలిపారు. రైతులు తమ పంటను దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. నియోజకవర్గంలోని రైతుల ఇబ్బందులను గమనించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ కేంద్రాలను మంజూరు చేయించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, ఆర్ఐ కృష్ణ, హరీష్, సిపిఐ మండల కార్యదర్శి దీటి లక్ష్మీపతి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తగు జాగ్రతలు తీసుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి

*** జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ఎండ తీవ్రత ఉన్నందువలన తగు జాగ్రతలు తీసుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారము జిల్లా అధికారులతో వేసవి తీవ్రత (హీట్‌వేవ్) నేపథ్యంలో సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న ఎండ తీవ్రత (హీట్‌వేవ్) దృష్ట్యా పలు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, వేసవి కాలంలో మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు అత్యవసర పరిస్థితులు లేకపోతే బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. బయటకు వెళ్లే సందర్భంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలు తరచుగా నీరు, మజ్జిగ, పండ్లరసాలు వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు మరియు గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. హీట్‌వేవ్ ప్రభావం వల్ల అలసట, తలనొప్పి, వాంతులు, చెమటలు ఎక్కువగా పట్టటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యశాలకు వెళ్లాలని సూచించారు కూలీలు, కార్మికులు ఉదయం , సాయంత్రం సమయాల్లోనే పనులు నిర్వహించుకోవాలని, సంబంధిత అధికారి తగిన చర్యలు తీసుకోవాలని , బస్టాండ్ , రైల్వే స్టేషన్ ల దగ్గర చలివేంద్రాలు ఏర్పాటు చేయాలనీ, వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో షెడ్డు , తాగునీరు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలనీ సంబంధిత అధికారికి సూచించారు. జిల్లాలోనీ గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలో హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ హాస్పటలలో డాక్టర్లు సిబ్బంది మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు వేసవి కాలమైనందున అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశములో అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, వీఆర్వో సంగీత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాకుసుమం వెంకట్రాం నర్సయ్య సేవలు చిరస్మరణీయం

*** మాజీ ఎంపీపీ వెంకట స్వామి**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: అక్షరమే ఆయుధంగా, విద్యాబోధనే శ్వాసగా నాలుగు దశాబ్దాల పాటు విద్యాక్షేత్రంలో అలుపెరగని సేవలు అందించిన విద్యావేత్త, అజాతశత్రువు చీకటి వెంకట్రాం నర్సయ్య (జీవశాస్త్ర ఉపాధ్యాయులు)కు కేసముద్రం మండల గౌడ సంఘం నాయకులు సోమవారం కేసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'ఆత్మీయ సన్మాన సభ'లో ఆయనను శాలువాలు, పూలమాలలతో ముంచెత్తారు. ఈ సభలో మాజీ మండల అధ్యక్షులు పెరంబూదురు వెంకటస్వామి, గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మిగౌడ్ చిలువేరు మాట్లాడుతూ "చీకటి వెంకట్రాం నర్సన్న చీకటిని చీల్చి వెలుగును ప్రసాదించేవాడే గురువు. అలాంటి పేరును సార్థకం చేసుకుంటూ, వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో జ్ఞాన జ్యోతులను వెలిగించిన మహోన్నత వ్యక్తి చీకటి వెంకట్రాం నర్సయ్య. 40 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఆయన కేవలం పాఠాలు చెప్పలేదు, క్రమశిక్షణతో కూడిన పౌరులను తీర్చిదిద్దారు. 'గురుదేవోభవ' అనే మాటకు ఆయన ఒక నిలువెత్తు నిదర్శనం. వృత్తి పట్ల ఆయన చూపిన నిబద్ధత, విద్యార్థుల పట్ల చూపిన వాత్సల్యం నేటి తరం ఉపాధ్యాయులకు ఆదర్శం. ఆయన పదవీ విరమణ పొందుతున్నారంటే అది కేవలం విద్యా రంగానికి ఒక సాంకేతిక విరమణ మాత్రమే, కానీ మన హృదయాల నుండి, సమాజ సేవ నుండి ఆయనకు ఎన్నటికీ విరమణ లేదు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మాజీ సర్పంచ్ కన్న యాకన్న గౌడ్, అల్లం వెంకన్న, వెంకన్న ముదిరాజ్, కేసముద్రం గ్రామీణ మాజీ సర్పంచ్ కేజీఎస్ఎస్ అధ్యక్షులు రడం వెంకన్న గౌడ్, ఉప్పరపల్లి మాజీ సర్పంచ్ బండారు గోపమ్మ దయాకర్ గౌడ్, ప్రముఖ విద్యావేత్త మోడెం రవీందర్ గౌడ్, కేజీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చీకటి వేలాద్రి గౌడ్, పట్టణ అధ్యక్షులు అశోక్ గౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొని నర్సయ్యను ఘనంగా సన్మానించి, వారి సేవలను వేనోళ్ల కొనియాడారు.

# అంబేద్కర్. పూలే అశయాలకు అనుగుణంగా పని చేయాలి

*** గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గుగులోత్ కిషన్ నాయక్**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: కురవి మండలం కొత్తూరు(సి)గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ బాదావత్ చిన్ని అధ్యక్షతన గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్ ఆధ్వర్యంలో అంబేద్కర్. పూలే ఆలోచన విధానం మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ అంబేద్కర్ పూలే ఆలోచన విధానానికి అనుగుణంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని సర్పంచ్ వార్డు సభ్యులకు అయన సూచించారు. విద్యా ద్వారానే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తామని. విద్యతోనే సమాజంలో అసమానతలు తొలుగుతాయని తెలిపారు కావున గ్రామంలో విద్యార్థులను ఉన్నత చదువులు చదువుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు..దేశంలో స్వేచ్ఛ సమానత్వం కోసం. మహిళల హక్కుల కోసం. మానవ హక్కుల కోసం మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా తన జీవితాన్ని పూలే.అంబేద్కర్ కులరహిత సమాజం కోసం త్యాగం చేశారని కిషన్ నాయక్ పేర్కొన్నారు.. అంబేద్కర్ స్ఫూర్తితో సమాజంలో మానవ. మహిళల హక్కుల కోసం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.. అనంతరం నూతన పాలక వర్గాన్ని.ఎఎన్ఎం జ్యోతి. అశా కార్యకర్త శైలజ లను శాలువా కప్పి అయన సన్మానించారు..ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి జానీ పాషా.ఉపసర్పంచ్ పగడాల కృష్ణారెడ్డి. కాంగ్రెస్ పార్టీ నాయకులు మలిశెట్టి వేణు. వార్డు సభ్యులు పేరం శ్రీరాములు. చిట్టూరి లక్ష్మి నారాయణ..కొంపెల్లి మల్లయ్య గౌడ్.పత్తేపురపు వీరన్న.ధరావత్ లక్ష్మి.ఎఎన్ఎం జ్యోతి. అశా కార్యకర్త శైలజ.. పంచాయతీ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

# మూడేళ్ల చిన్నారిని పీక్కుతిన్న వీధికుక్కలు




సుల్తానాబాద్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో దారుణం చోటు చేసుకుంది. వీధికుక్కలు పీక్కుతినడంతో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. ఇంటిముందు ఆడుకుంటున్న దివ్యా బెహ్రా అనే బాలికపై కుక్కలు దాడి చేశాయి. ఆమెను నోట కరుచుకుని పొలాల్లోకి ఈడ్చుకెళ్లాయి. ఈక్రమంలో కుక్కలు పీక్కుతినడంతో తీవ్రగాయాలతో మృతి చెందింది. చిన్నారి తల్లిదండ్రులు ఒడిశా నుంచి వచ్చి ఇటుకబట్టీల్లో పనిచేస్తున్నారు.

# కుత్బుల్లాపూర్ లో ఘనంగా శ్రీ బసవేశ్వరా జయంతి వేడుకలు





జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : సమానత్వం మరియు న్యాయం....ఇవే మనకు బసవేశ్వరుడు చూపిన మార్గాలుఅని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ ఫార్టీ ఫీట్ రోడ్ నందు కర్ణబత్తుల సంక్షేమ సంఘం వారి శ్రీ బసవేశ్వర మైత్రి సేనా, కుత్బుల్లాపూర్ సుభాష్‌నగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ బసవేశ్వరా 893వ జయంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై బసవేశ్వర స్వామి వారి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు సూర్య చందర్ రావు, దానకోట మల్లికార్జున్ రావు, మల్లేశ్వర్ రావు, దాన శివాజీ గణేష్, నాగ భూషణం, సత్యనారాయణ, సూరిబాబు, శ్రీను, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

*** వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ...**

వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం షాపూర్ నగర్, జీడిమెట్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ చౌరస్తాలో నిర్వహించిన శ్రీ బసవేశ్వర 893వ జయంతి వేడుకలలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వీరబోజు బస్వరాజు, ఉపాధ్యక్షులు గజ్వేల్ భద్రప్ప, కుప్పునూరి వీరేశం, ప్రధాన కార్యదర్శి అవుటి రమేష్, బట్టొళ్ల గౌరీశంకర్, దోమ వీరేషం, సింగీతం అనిల్, శెట్టి ప్రకాష్, శెట్టి శ్రీశైలం, గాడి ప్రభులింగం, అవుటి జై కుమార్, గౌరవ అధ్యక్షులు నాగరాజు గౌడ్, కోలుకుంద బస్వరాజు, సభ్యులు రాజలింగం, ప్రభులింగం, అమర్ నాథ్, రుద్ర కుమార్, సంగమేశ్వర్, సోమనందం, వీర శైవ లింగాయత్ కుల భాంధవులు, మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సిద్దిక్, నాయకులు చెక్క సురేష్, నేటి రాజు, కోల శ్రీకాంత్ ముదిరాజ్, విజయ్, సదాశివుని శంకరప్ప, సదాశివుని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

*** గాజుల రామారం డివిజన్ లో...**

గాజుల రామారం డివిజన్ హెచ్ఏఎల్ కాలనీలో శ్రీ బసవేశ్వర మైత్రి సేన మరియు కర్ణ భక్తుల సంక్షేమ సంఘం, గాజుల రామారం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ బసవేశ్వర మహారాజ్ 893వ జయంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై బసవేశ్వర మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులార్పించారు. ఈ కార్యక్రమంలో కర్ణభక్తులు సంక్షేమ సంఘం కార్యవర్గ కమిటీ అధ్యక్షులు వాసా సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు & కోశాధికారి తమ్మా రామచంద్ర మూర్తి, ముఖ్య కార్యదర్శి తాడి శెట్టి జయచంద్ర మోహన్, సహాయ కార్యదర్శులు సమతం భీమేశ్వరరావు గారు, తాడిశెట్టి శ్రీనివాస్ (వాసు), మాజీ కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ,సురేష్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, వీరయ్య చౌదరి, చిన్నా చౌదరి, సాయిబాబా, శివా నాయక్, పి.గోపాల్ యాదవ్, పలు డివిజన్లకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లును పదేళ్లకు వాయిదా వేసేందుకు భాజపా కుట్ర: రాహుల్ గాంధీ

చెన్నై: మహిళా రిజర్వేషన్ల బిల్లును మరో పదేళ్లకు వాయిదా వేసేందుకు భాజపా ప్రభుత్వం కుట్ర పన్నిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. తమిళనాడు శాసనసభ ఎన్నికల సందర్భంగా సోమవారం కన్యాకుమారి, తిరునెల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో డీఎంకే నాయకత్వంలోని లౌకికవాద ప్రగతిశీల కూటమి అభ్యర్థులకు మద్దతుగా జరిగిన ప్రచారసభల్లో ఆయన ప్రసంగించారు. కొన్నేళ్ల కిందట కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'ను గుర్తుచేస్తూ.. దేశాన్ని సమైక్యపరచడం, ప్రజల్లో ప్రేమను నాటడమే ఆ యాత్ర ముఖ్యోద్దేశమని తెలిపారు. పలు భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలను కలిగిన భారతదేశంలోని భిన్నత్వాన్ని కాపాడటమే నిజమైన దేశభక్తి అన్నారు. వేర్పాటువాద రాజకీయాలను ముందుకు తీసుకెళ్తున్న భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా నేడు పోరాడుతున్నామని చెప్పారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశం రాష్ట్రాల యూనియన్ అని, ప్రతి రాష్ట్రానికి, అక్కడ మాట్లాడే ప్రతి భాషకు సమానమైన విలువ, హక్కు ఉందని పేర్కొన్నారు. చిన్నదో, పెద్దదో ప్రతి రాష్ట్రం తమకు ముఖ్యమన్నారు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే చరిత్ర అంటూ అన్నింటినీ ఒకే మూసలో బంధించాలని భాజపా భావిస్తోందని ఆరోపించారు. దేశంలో ఒకే చరిత్ర ఉంటే తమిళుల చరిత్ర, కర్ణాటక, మహారాష్ట్ర, మణిపుర్ ప్రజల చరిత్ర ఏమవ్వాలని ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు అన్ని రాష్ట్రాలు లోబడి ఉండాలని భాజపా భావిస్తోందన్నారు. దక్షిణ భారతదేశ గళాన్ని నొక్కేందుకు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాల



లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను తగ్గించి ఆ రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 2023 మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణం అమలు చేస్తే మద్దతిస్తామని తెలిపారు. ఆ బిల్లును పదేళ్లు వాయిదా వేయాలని భాజపా భావిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో సామాన్యుల పురోభివృద్ధి కోసం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రస్తుతం భాజపా ప్రభుత్వం పేరు మార్చి అస్తవ్యస్తం చేస్తోందని విమర్శించారు.




## మహిళా కస్టమర్‌తో డ్రైవర్ అనుచిత ప్రవర్తన.. స్పందించిన ర్యాపిడో

హైదరాబాద్, ఏప్రిల్ 20: మన అవసరాల కోసం వ్యక్తిగత ఫోన్ నంబర్లతో క్యాబ్ బుకింగ్ సేవలను వినియోగించుకుంటాం. కొందరు క్యాబ్ డ్రైవర్లు ఇదే అదునుగా తప్పుడు మార్గాన్ని ఎంచుకుంటారు. ఇటీవల ర్యాపిడో (Rapi do) వినియోగించిన ఓ మహిళా కస్టమర్‌కు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. దీనిపై ఆ మహిళ సామాజిక మాధ్యమాల వేదికగా గళం ఎత్తడంతో ర్యాపిడో యాజమాన్యం స్పందించింది. ఓ మహిళ కస్టమర్ ర్యాపిడో బుక్ చేసుకున్నారు. తీరా గమ్యం చేరిన తర్వాత ఆ ర్యాపిడో డ్రైవర్ కస్టమర్ ఇచ్చిన ఫోన్ నంబర్‌తో వాట్సప్‌లో కాంటాక్ట్ అయ్యాడు. అజ్ఞాత వ్యక్తిలా చాట్ చేయడం ప్రారంభించాడు. ''మీరు చూడ్డానికి అందంగా ఉన్నారు.. మీ వయసెంత?'' అంటూ చాట్ చేశాడు. దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్లను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీనిపై ర్యాపిడో సంస్థ స్పందించింది. ఆ డ్రైవర్ అనుచిత ప్రవర్తనపై క్షమాపణలు కోరింది. రిజిస్టర్డ్ ఫోన్ నంబరు, రైడ్ ఐడీ ద్వారా సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చింది.

## ఐదేళ్ల వయసులో తప్పిపోయాడు..25 ఏళ్లకు అమ్మను చేరుకున్నాడు

హైదరాబాద్: ఏప్రిల్ 20: అనుకోకుండా కుటుంబానికి దూరమై.. 25 ఏళ్ల తర్వాత తన మూలాలను వెతుక్కుంటూ ఒక యువకుడు చేసిన ప్రయాణం ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. గమ్యం చేరుకునే క్రమంలో అతడికి ఎదురైన పరిస్థితులు ప్రతిఒక్కరినీ కన్నీరుపెట్టిస్తున్నాయి. ఈ సరూ బ్రియర్లీ స్టోరీ ఓసారి చూద్దామా..! అది 1986.. అప్పుడు సరూ వయసు ఐదేళ్లు. తన అన్న (Guddu) కోసం రైల్వే స్టేషన్‌లో ఎదురుచూస్తున్నాడు. రైలు వచ్చినా అన్న కనిపించకపోవడంతో.. తనే రైలెక్కాడు. సోదరుడు లోపలే ఉంటాడని భావించి, అంతలోనే రైలు కదిలింది. అన్నమాత్రం ఎక్కడా కనిపించలేదు. తర్వాత ఆ రైలు రెండురోజుల పాటు ప్రయాణించి, కోల్‌కతాలో ఆగింది. అంటే తను ఎక్కిన స్వగ్రామానికి 1500కి. మీ.దూరంలో. ఇంటికి ఎలా వెళ్లాలో తెలియదు. తన ఊరు, ఇంటిపేరు కూడా తెలియని పసితనం. ఎవరైనా ఆదరించకపోరా..అనే బేలతనం. ఇలానే కొన్నివారాలు వీధుల్లోనే గడిచిపోయాయి. తర్వాత అతడిని కొందరు అనాథాశ్రమంలో చేర్పించారు. అక్కడే జీవితం మలుపు తిరిగింది. ఒక ఆస్ట్రేలియా జంట దత్తత తీసుకుంది. దాంతో దేశం దాటాడు. కానీ ఒక కలలా బాల్య స్మృతులు మాత్రం అతడిని




వెంటాడుతూనే ఉండేవి. ఒక రైల్వే స్టేషన్, ఒక వంతెన, ఒక వాటర్ టవర్, తన ఇల్లు ఉన్న వీధులు.. మనసులో కదలాడుతూనే ఉండేవి. అతడు 20ల్లోకి వచ్చాడు. తనను వెంటాడుతున్న జ్ఞాపకాలను అన్వేషించాలనుకున్నాడు. వెంటనే గూగుల్ ఎర్త్‌లో వెతకడం ప్రారంభించాడు. కోల్‌కతాలో దిగిన దగ్గరి నుంచి రైలు మార్గాలను పరిశీలించాడు. కొన్ని సంవత్సరాల పాటు అలా వెతుకుతూనే ఉన్నాడు. 2011..ఆ వెతుకులాటకు ఒక ఫుల్‌స్టాప్ పడింది. ఆ గుర్తులన్నీ అతడిని మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వాకు తీసుకెళ్లాయి. ఆ వెంటనే ఇండియాకు వచ్చి ఆ ప్రాంతంలో వెతుకుతూ వెళ్లాడు. ఎట్టకేలకు తన కుటుంబాన్ని చేరుకున్నాడు. ఆ తర్వాత అతడి హృదయం ముక్కలయ్యే విషయం ఒకటి తెలుసుకున్నాడు. తాను మిస్ అయిన రోజే.. సోదరుడు రైలు ఢీకొని చనిపోయాడు. ఈ ఇద్దరు బిడ్డల కోసం ఆశచావక ఆ తల్లి వెతుకుతూనే ఉందని విషయం తెలుసుకొని తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. తన స్టోరీని సరూ 'A Long Way Home' అనే పుస్తకంగా మలిచాడు. ఈ నిజజీవిత కథ స్ఫూర్తిగా లయన్ అనే సినిమా కూడా వచ్చింది. అందులో సరూ పాత్రను ప్రముఖ నటుడు దేవ్ పటేల్ పోషించాడు. దీనికి ఆరు ఆస్కార్ నామినేషన్లు దక్కడం విశేషం. ఈ రియల్ స్టోరీ తెలుసుకొని నెటిజన్లు ఉద్వేగానికి గురవుతున్నారు

### రూ.100కోట్లు తేడా ఉంది

## టీవీకే విజయ్‌కు హైకోర్టు నోటీసులు


చెన్నై, ఏప్రిల్ 20 టీవీకే అధినేత విజయ్‌కి మద్రాసు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ లో అవకతవకలు ఉన్నాయంటూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. దానిని పరిశీలించిన అనంతరం సోమవారం కోర్టు ఈ నోటీసులు ఇచ్చింది. విజయ్ సమర్పించిన అఫిడవిట్లలో తేడాలున్నాయంటూ చెన్నైకి చెందిన వి.విఘ్నేశ్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్



వేశారు. తిరుచ్చి, పెరంబూర్ నియోజకవర్గాల నుంచి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పోటీచేస్తున్నారు. పెరంబూర్‌లో సమర్పించిన అఫిడవిట్ లో ఆయన ఆస్తుల వివరాలు రూ.115 కోట్లుగా ఉండగా.. తిరుచ్చిలో రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఇచ్చిన వివరాల్లో వెల్లడించిన ఆస్తుల విలువ రూ.220కోట్లుగా ఉందని పిటిషనర్ ఆరోపించారు. ఇలా ఎందుకు తేడా చూపించాల్సి వచ్చిందో వివరించేలా ఎలాంటి అనుబంధ పత్రాలు విజయ్ ఇవ్వలేదన్నారు. వచ్చేవారం దీనిపై తదుపరి విచారణ జరగనుంది.

## ప్రారంభానికి ఒకరోజు ముందు.. రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం


జైపూర్/బలోత్రా, ఏప్రిల్ 20 రాజస్థాన్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. బలోత్రా జిల్లా పచ్‌పద్రలోని ఆయిల్ రిఫైనరీలో సోమవారం పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. మంగళవారం (ఏప్రిల్ 21) ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ఇది ప్రారంభం కావాల్సి ఉంది. ఈ రిఫైనరీకి 2013, సెప్టెంబర్ 22న సోనియాగాంధీ శంకుస్థాపన చేశారు. అప్పుడు రాజస్థాన్‌లో అశోక్ గహ్లోత్ ప్రభుత్వం అధికారంలో ఉంది. జనవరి 16, 2018లో మోదీ ప్రభుత్వం దీనిని రీలాంచ్ చేసింది. అప్పుడు ప్రాజెక్ట్ వ్యయం రూ.43,129కోట్లు. ఈ మొత్తాన్ని రూ.79,459 కోట్లకు సవరించేందుకు ఇటీవలే కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇచ్చింది. ఈ రిఫైనరీ.. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (HPCL) ఆధ్వర్యంలో నిర్మించారు. ఇది రేపు అందుబాటులోకి వచ్చి



ఉంటే.. దేశంలోని అతిపెద్ద అనుసంధానిత రిఫైనరీ పెట్రో రసాయనాల కాంప్లెక్స్‌ల్లో ఒకటిగా నిలిచేది. ఈ ప్రాజెక్టు మొత్తం వార్షిక సామర్థ్యం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు కాగా.. ఇందులో పెట్రోరసాయనాల ఉత్పత్తుల సామర్థ్యం 2.4 మిలియన్ మెట్రిక్ టన్నులు.

## చెట్టును ఢీకొట్టి.. కుప్పకూలిన ప్రైవేటు జెట్

జశ్‌పుర్ (ఛత్తీస్‌గఢ్) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జశ్‌పుర్ జిల్లాలోని కొండల్లో ప్రైవేట్ జెట్ కుప్పకూలింది. అటవీ ప్రాంతంలో చెట్టును ఢీకొన్న తర్వాత ఇది కూలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోయినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలిలో మంటలు ఎగసిపడటంతో పాటు పొగ దట్టంగా అలముకుంది. ప్రైవేటు జెట్‌లో ఎంత మంది ప్రయాణించారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.



పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## మేం చెప్పాకే హర్మూజ్‌లోకి వెళ్లండి: ఇండియన్ నేవీ

హర్మూజ్ జలసంధి (Strait of Hormuz)లో భారత జెండాతో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత పతాక నౌకలకు భారత నౌకదళం అడ్వైజరీ జారీ చేసిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని, తమనుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే హర్మూజ్‌లో ప్రయాణించాలని నేవీ పేర్కొంది. ఆ జలసంధిని దాటేందుకు వేచి ఉన్న నౌకల భద్రతను నిర్ధారించేందుకే ఈ




సూచనలని తెలిపింది. లారక్ ద్వీపం హర్మూజ్‌కు సమీపంలో ఉంటుంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి 11 నౌకలు ఈ జలమార్గాన్ని దాటాయి. దానిని దాటిన చివరి ట్యాంకర్ దేశ్ గరిమ (ఏప్రిల్ 18న). అదే రోజు జగ్ అర్ణవ్, సన్మార్ హెరాల్డ్ ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా.. ఇరాన్ బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనను విదేశాంగశాఖ ఖండించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి ఈ ఘటనపై నిరసనను తెలియజేసింది. గతంలో తమ దేశానికి బయల్దేరిన అనేక నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సహకరించిందని ఈ సందర్భంగా గుర్తుచేసింది.

## ఉధంపూర్ వద్ద లోయలో పడిన బస్సు.. 21 మంది మృతి

ఉధంపూర్ (జమ్మూకశ్మీర్) , ఏప్రిల్ 21 : జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ రూట్‌లో వెళ్తున్న ఓ బస్సు లోయలో పడింది. ఈ విషాదకర ఘటనలో దాదాపు 21 మంది మృతి చెందగా చాలామందికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. రామ్‌నగర్ నుంచి ఉధంపూర్ వెళ్తుండగా మధ్యలో జాలో అనే ప్రాంతంలో బస్సు ప్రమాదానికి గురైంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఉధంపూర్ డీఐజీ శివకుమార్ శర్మ పేర్కొన్నారు. ''కొండ ప్రాంతంలో మలుపు వద్ద దారి కనిపించకపోవడం వల్లే ఉదయం సుమారు 10 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. భారీ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నాం. 21 మంది మృతి చెందినట్టు గుర్తించాం. మరో 20 మందికి పైగా గాయపడ్డారు. ఘటనా స్థలం నుంచి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్నాం. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది'' అని డీఐజీ తెలిపారు.

### మనీలాండరింగ్ ఆరోపణలు..

## కాంగ్రెస్ ఎమ్మెల్యే కుమారుల కార్యాలయాల్లో సోదాలు

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్ఏ హారిస్ కుమారులకు చెందిన ప్రాంగణాల్లో సోమవారం ఈడీ దాడులు నిర్వహించింది. క్రిప్టో కరెన్సీకి సంబంధించి మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నట్లు వారిపై ఆరోపణలు రావడంతో దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగిందని అధికారులు వెల్లడించారు. బెంగళూరులో మరికొన్నిచోట్లా ఈ సోదాలు జరిగినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కుమారులతో పాటు క్రిప్టో హ్యాకర్ శ్రీకృష్ణ రమేశ్ అలియాస్ శ్రీ కి చెందిన కార్యాలయాలను ఈడీ లక్ష్యంగా చేసుకుంది. శ్రీ తో పాటు అతడి సహాయకులు జాతీయ, అంతర్జాతీయ వెబ్‌సైట్లను హ్యాక్ చేసి, బిట్‌కాయిన్లను దొంగిలించారంటూ 2017లో పలు కేసులు, ఛార్జ్‌షీట్లు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణలో భాగంగా తాజా సోదాలు జరిగాయి. క్రిప్టో నేరాల ద్వారా వచ్చిన ఆదాయం నుంచి ఎమ్మెల్యే కుమారులు కూడా లబ్ధి పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. హారిస్.. బెంగళూరులోని శాంతినగర్ ఎమ్మెల్యేగా ఉన్నారు.



ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

# ఎండల్లో తప్పు చేయకండి!

ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు, అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.

### ఇంట్లో అక్కర్లేదు

సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.

### కడుగుతూనే ఉండాలి


ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటిమాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది.

### అదైతే చాలు

వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే.

### అన్నీ తాగొచ్చు

ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.



# ఆటిజం.. అరువు తెచ్చుకుంటున్నం!

మన దేశంలో ప్రతి 80మంది చిన్నారుల్లో ఒకరికి ఆటిజం సమస్య ఉండవచ్చనేది ఒక అంచనా. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆటిజంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 2న 'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' నిర్వహిస్తున్నది. అసలు ఈ ఆటిజం అంటే ఏంటి, అది ఎందుకు వస్తుంది, రావడానికి గల కారణాలేంటి? దాని లక్షణాలు, ఆటిజం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్యం ఏర్పడుతుంది? ఈ సమస్యను ఎలా గుర్తించాలి, నిర్ధారణ పద్ధతులు, చికిత్సా విధానం తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

**ఆటిజం** అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి లక్షణం. చాలా ఆటిజం కేసుల్లో మాటలు మొదట్లో వస్తాయి. కానీ రెండేండ్లు వచ్చేసరికి మాటలు ఆగిపోతాయి. దీనినే 'రిగ్రెషన్' అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేండ్లలోపే ఇది జరుగుతుంది. ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో నాలుగైదు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

1. భావ వ్యక్తీకరణ లేకపోవడం. అది భాష పరంగా గానీ, హావభావాలు వ్యక్తపరచడంలో గానీ సమస్య ఉంటుంది. అంటే వాళ్లు సరిగ్గా మాట్లాడలేరు.
2. ఇతరుల భావాలను గ్రహించలేరు. అంతేకాదు వారి భావోద్వేగాలను వ్యక్తపర్చలేరు.
3. సామాజిక బాంధవ్యాలు తెలియదు. అంటే ఇతరులతో కలిసి ఆడుకోవడం, కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు.
4. చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు.
5. ఈ చిన్నారుల్లో మానసిక పరిణతి తక్కువగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ సమస్యలతో సతమతమవుతున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.



### కారణాలు

- ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేకమైన కారణమని ఏదీ లేదు. సాధారణంగా 9 నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతో పాటు, గ్రహించడం, భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయసులో చిన్నారులకు ఫోన్‌లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు కావడం వల్ల భావ వ్యక్తీకరణ, భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. స్క్రీన్ టైమ్‌కి అలవాటు పడితే ఈ సమస్యలు వస్తాయి.

అమెరికన్ పీడియాట్రిక్ సొసైటీ ప్రకారం మొదటి 3 సంవత్సరాల వరకు పిల్లలను ఫోన్, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటుపడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని సదరు సొసైటీ హెచ్చరించింది.

- బహుళ భాషలను నేర్చుకోవాల్సి రావడమూ పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావొచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో.. తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల, పిల్లలకు ఏ భాషను స్వీకరించాలో అర్థం కాదు. వాళ్లు అయోమయానికి గురై భాషపై పట్టుచిక్కకపోవడం వల్ల ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి.
- యాంటీ బయోటిక్స్ లాంటి ఔషధాలు ఎక్కువగా వాడటం కూడా ఆటిజానికి దారి తీయొచ్చు.
- ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ కనిపిస్తున్నది.
- 18 నెలల వయసులో పిల్లలకు ఇచ్చే ఎంఎంఆర్ టీకా వల్ల కూడా ఆటిజం వస్తుందనేది ప్రజల్లో ఉన్న ఒక అపోహ మాత్రమే. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు.

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మేనమామ, అత్తయ్య, చిన్నాన్న, పిన్ని... ఇలా ఎవరో ఒకరు పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల ఊసే లేదు. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. నిరంతరం వారి మధ్య ఉండటం వల్ల పిల్లల్లో భాషా వికాసం బాగా ఉండేది. హావభావాల వ్యక్తీకరణతో పాటు మానసిక పురోగతిలోనూ వయసుకు తగ్గ పరిణతి కనిపించేది. కానీ, ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల ఉనికి గణనీయంగా తగ్గిపోయింది. నూటికి 90 శాతం న్యూక్లియర్ ఫ్యామిలీలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తున్నది. మనుషులతో కన్నా డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైంది. ఏడాది వయసున్న పిల్లలు కూడా సెల్‌ఫోన్, ట్యాబ్‌తో ఆడుకోవడం కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు.

### రోగ నిర్ధారణ పద్ధతులు

**ప్రత్యేక** లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గానీ, రోగ నిర్ధారణ పద్ధతులు గానీ అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మాత్రమే సమస్యను కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలరు.

### లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కండ్లలోకి కూడా నేరుగా చూడలేకపోవడం
- పేరుపెట్టి పిలిచినా వెంటనే స్పందించకపోవడం
- ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవడం
- ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడటం
- ఒకే రకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మ ఇస్తే తీసుకోకపోవడం
- కొందరు పిల్లల్లోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబద్ధంగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ మొదటి మూడు సంవత్సరాల్లోపు కనిపిస్తాయి.

### చికిత్సా పద్ధతులు

ఆటిజానికి సంబంధించిన లక్షణాలను ఎంత త్వరగా గుర్తించి, సరైన థెరపీలను అందించగలిగితే అంత మంచిది. 6 నెల్లోనే 50 శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం 3 సంవత్సరాల్లోపు సమస్యను గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ 3 సంవత్సరాల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఎలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. ఆటిజం బాధిత చిన్నారులకు ప్రధానంగా మూడు రకాల థెరపీలతో చికిత్స అందిస్తారు. అందులో 1.ఆక్యుపేషనల్ థెరపీ 2. బిహేవియర్ థెరపీ 3. స్పీచ్ థెరపీ

### 1.ఆక్యుపేషనల్ థెరపీ:

పిల్లల్లో ప్రారంభ దశలో జ్ఞానేంద్రియాలు అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే, ఆక్యుపేషనల్ థెరపీ అందించవచ్చు. దీని వల్ల ఐదు జ్ఞానేంద్రియాలు నియంత్రణలోకి వచ్చి, సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది.



### 2.బిహేవియర్ థెరపీ:

బిహేవియర్ థెరపీతో పిల్లల అసాధారణ ప్రవర్తనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించవచ్చు.


### 3. స్పీచ్ థెరపీ:

ఆటిజం పిల్లల విషయంలో స్పీచ్ థెరపీ చాలా ముఖ్యమైంది. మొదటి రెండు థెరపీలు... అంటే ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీల తర్వాతే స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

### సలహాలు

- ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- మూడేండ్లలోపు పిల్లలను బ్లూ లైట్‌కు దూరంగా ఉంచాలి. అంటే సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వకూడదు.
- పిల్లలకు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇచ్చి, ఒంటరిగా వదిలేయకుండా వారితో తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు గడపడం ఉత్తమం.





# నిద్రలోనూ సుఖం లేదు!

**శారీరక** శ్రమకు, మానసిక ఆందోళనకు చక్కని ఔషధం నిద్ర. ఆరు గంటలు ఆదమరచి నిద్దరోతే.. సమస్యలన్నీ పరారైన అనుభూతి కలుగుతుంది. కానీ, సుఖమెరుగని నిద్ర.. అతివలకు అంతగా అందడం లేదని సర్వేల సారాంశం. స్లీప్ ఫౌండేషన్ ఇచ్చిన నివేదిక.. పురుషుల కన్నా స్త్రీలు నిద్రలేమితో ఎక్కువగా బాధపడుతున్నారని తేల్చింది. ఉద్యోగం, ఇల్లు, పిల్లలు, ఇతర బాధ్యతలతో మల్టీ టాస్కింగ్ చేస్తున్న మహిళలు సరైన నిద్ర లేక సతమతమవుతున్నారని నివేదిక సారాంశం. ఇందుకు కారణాలూ లేకపోలేదు. రుతుక్రమంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్లలో హెచ్చుతగ్గులు నిద్రకు భంగం కలిగిస్తాయి. ముఖ్యంగా రుతుస్రావం ముందు, మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు నిద్రను భంగపరుస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. అంతే కాదు గర్భిణిగా ఉన్నప్పుడు హార్మోన్లలో చోటుచేసుకునే మార్పుల కారణంగా శారీరక అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది నిద్ర నాణ్యతపై గణనీయంగా ప్రభావం చూపుతుందట. ఈ నిద్రలేమి హృదయ సంబంధ వ్యాధులు, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఆరోగ్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుఖనిద్రకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# స్నానం తర్వాత బ్రషింగా?

**ఒక్కోసారి** హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒకవేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# ముందే తినేయాలి!

రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..

**వయసు,** లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్న మాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది. గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి.

2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే... ''ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.



# గ్లైఫోసేట్.. గర్భిణులకు ముప్పు

**గ్లైఫోసేట్‌ను** పంటల్లో కలుపు నివారణకు వాడతారు. ఇది పంటలకు హాని కలిగించకుండానే కలుపును నిర్మూలిస్తుంది. కాబట్టి, రైతులు దీన్ని విస్తృతంగా వాడుతున్నారు. ఏండ్ల తరబడి జరిగిన అధ్యయనాల ద్వారా గ్లైఫోసేట్ మనుషుల్లో క్యాన్సర్‌కు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఆహారం రూపంలో అంతగా హాని కలిగించనప్పటికీ గ్లైఫోసేట్ ఆధారిత రసాయనాలు మనుషులను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. చర్మం మండుతుంది. శ్వాసిస్తే ముక్కు రంధ్రాల్లో ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లయితే తీవ్రతను బట్టి కాలేయం, కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. మరణం కూడా సంభవించవచ్చు. అంతేకాదు... గ్లైఫోసేట్ గర్భిణుల మీద మరింత దుష్ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయంలో ఏ కొంచెం తగ్గినా కూడా పుట్టబోయే శిశువు జీవితంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుంది. పైగా బిడ్డ పుట్టకముందే శాశ్వత నష్టం కూడా జరగవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత కూడా శరీర పెరుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. గర్భిణులపై గ్లైఫోసేట్ ప్రభావం గురించి అమెరికాకు చెందిన 'ది ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ యూనిట్' జరిపిన సర్వేలో ఈ వివరాలు తెలిశాయి.



అధ్యయనం కోసం పరిశోధకులు 18– 40 సంవత్సరాల మధ్య వయసున్న 77 మంది మహిళల్ని ఎంచుకున్నారు. వీరిని 2015 జూన్ నుంచి 2016 జూన్ వరకు పరీక్షించారు. వీరి మూత్రం నమూనాల్లో దాదాపు 93 శాతం మందిలో గ్లైఫోసేట్ అవశేషాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నట్టు గుర్తించారు. పట్టణ మహిళలతో పోలిస్తే గ్రామీణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. మొదట్లో దీనికి కారణం నీళ్లు కావచ్చని అనుకున్నారు. కానీ కలుపు నివారణకు గ్లైఫోసేట్ వాడటం వల్ల ఆయా పంటలను ఆహారంగా తీసుకోవడంతో ఈ దుస్థితి దాపురించిందని ఇప్పుడు అనుమానిస్తున్నారు. ఇది చిన్న అధ్యయనమే అయినప్పటికీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలనేది పరిశోధకుల హెచ్చరిక. మరో విషయం... గర్భిణులు తమ తొలి మూడు నెలల కాలంలో ఈ కలుపు నివారిణికి దూరంగా ఉండాలంటున్నారు పరిశోధకులు. లేదంటే తల్లిపాల ద్వారా కలుపుమందు అవశేషాలు పిల్లలకు చేరుకుంటాయి. కాబట్టి, రైతులు కూడా గ్లైఫోసేట్‌కు ప్రత్యామ్నాయాలను వాడాలి. గర్భిణులు తొమ్మిది నెలలపాటు ఈ కలుపుమందు ప్రభావం అసలే పడకుండా జాగ్రత్త వహించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.



# పెద్దిలో స్పెషల్ సాంగ్ కోసం సంయుక్త మీనన్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది'. ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుండి దీనిపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. తాజాగా ఈ సినిమా గురించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఒక ప్రత్యేక గీతం కోసం 'గోల్డెన్ లెగ్' సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రామ్ చరణ్ సినిమాల్లో పాటలు, ముఖ్యంగా మాస్ సాంగ్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'పెద్ది' కోసం ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అదిరిపోయే ట్యూన్ సిద్ధం చేశారని సమాచారం. ఈ మాస్ నంబర్‌లో రామ్ చరణ్ సరసన సంయుక్త మీనన్ ఆడిపాడనుందనే వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యింది. సంయుక్త తొలిసారిగా అఖండ 2 లో బాలయ్య సరసన జాజికాయ అనే స్పెషల్ సాంగ్ లో నటించి మెప్పించింది. ఇప్పుడు మరోసారి స్పెషల్ సాంగ్‌లో మెగా హీరోతో స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం. అయితే ఈ స్పెషల్ సాంగ్ లో చరణ్ సరసన మానస వారణాసి, మృణాల్ ఠాకూర్, పూజాహెగ్డే వంటి భామల పేర్లు వినిపించాయి కానీ చివరికి సంయుక్తకు డైరెక్టర్ బుచ్చిబాబు గ్రీన్ సిగ్నల్ ఇసినట్టు తెలుస్తోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా 'పెద్ది' రూపొందుతోంది. ఇందులో రామ్ చరణ్ మునుపెన్నడూ లేని విధంగా ఒక కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇప్పుడు సంయుక్త మీనన్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుంది. ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని, బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.

# యూత్ మూవీకి రిషబ్ శెట్టి ఫిదా

ఇటీవల విడుదలై మంచి ఆదరణ సొంతం చేసుకుంటోంది 'యూత్' మూవీ. ఇప్పటికే దీనిపై ఎంతోమంది సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించగా.. తాజాగా రిషబ్‌శెట్టి కూడా దీనికి ఫిదా అయ్యారు. ఎక్స్ వేదికగా దీనిపై పోస్ట్ పెట్టారు. చాలాకాలం తర్వాత, ఒక సినిమా చూస్తున్నంతసేపు నేను నవ్వుతూనే ఉన్నాను. 'యూత్' సినిమాలో ఎన్నో భావోద్వేగాలున్నాయి. తల్లిదండ్రులకు ఇచ్చిన గొప్ప బహుమతి 'యూత్'. తెరపై నటీనటులంతా చాలా సహజంగా కనిపించారని రిషబ్ అన్నారు. దర్శకుడి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన రిషబ్ సినిమా రంగానికి కెన్ కరుణాస్ ఒక గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు.



'యూత్' కథేంటంటే..: మధ్యతరగతి కుటుంబానికి చెందిన టీనేజర్ ప్రవీణ్ (కెన్ కరుణాస్). అతడి అల్లరి పనుల వల్ల స్కూల్‌లో ఏ అమ్మాయీ తనవైపు కన్నెత్తి కూడా చూడదు. కానీ, ప్రవీణ్ మాత్రం తన స్కూల్ లైఫ్ పూర్తయ్యేలోపు ప్రేమించాలన్న లక్ష్యంతో ప్రయత్నాలు చేస్తుంటాడు. ఈ క్రమంలోనే గంగవల్లి (అనీషా అనిల్ కుమార్), ప్రేషిక (మీనాక్షి దినేష్), సోనాల్ (ప్రియాన్షీ యాదవ్) తన జీవితంలోకి వస్తారు. మరి ఆ ముగ్గురి వల్ల ప్రవీణ్ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? ప్రేమ, బ్రేకప్, అవమానాలు లాంటి అనుభవాలతో అతడు నేర్చుకున్న జీవిత పాఠమేంటి? ఈ ప్రయాణంలో తన తల్లిదండ్రులు ఉన్నికృష్ణన్ (సూరజ్ వెంజరమూడు), సరోజ (దేవదర్శిని) పాత్రలకి ఉన్న ప్రాధాన్యం ఏంటి? వారి కలల్ని హీరో నెరవేర్చాడా? అన్నది మిగిలిన కథ.

# బాబూ మోహన్‌కు రేలంగి అవార్డు

హాస్యనటచక్రవర్తి పద్మశ్రీ రేలంగి అవార్డును నటుడు డా.బాబుమోహన్ అందుకున్నారు. 41ఏండ్ల నటజీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు ఫిల్మ్ టెలివిజన్ వెల్ఫేర్ ఫార్మ్ అండ్ భారత్ కల్చరల్ అకాడమీ సంస్థ ఆయనకు ఈ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, నాగబాల సురేశ్,



నటుడు రాంకీ, 30ఇయర్స్ పృథ్వీరాజ్ తదితరులు అతిథులుగా పాల్గొని తెలుగు సినిమాకు బాబుమోహన్ చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు.

బాబుమోహన్ మాట్లాడుతూ 'రేలంగి అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ 41ఏండ్ల నట జీవితంలో నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నాను. అవార్డుల కంటే ప్రజల ఆశీస్సులే గొప్ప దీవెన. ఇక 'పద్మ' అవార్డు వస్తే సంతోషం. రాకపోయినా ఫర్వాలేదు' అని బాబుమోహన్ అన్నారు.



# హోంబలే నుంచి మహావతార్ పరశురామ్

కేజీఎఫ్, కాంతారా, సలార్, మహావతార్ నరసింహ.. ఇలా వరుస బ్లాక్‌బాస్టర్స్‌తో సినిమా స్థాయిని పెంచిన నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి రాబోతున్న మరో యానిమేటెడ్ దృశ్యకావ్యం 'మహావతార్ పరశురామ్' రాబోతోంది. పరశురామ జయంతి సందర్భంగా 'మహావతార్' సినిమాటిక్ యూనివర్స్‌ని ప్రజెంట్ చేస్తూ ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని, గ్లింప్స్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. గొడ్డలి చేతబట్టి నరమేధాన్ని సృష్టిస్తున్న పరశురాముడ్ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పరశురాముడి ముఖాన్ని చూపించకుండా, ఆయన చేతిలో రక్తంతో తడిసిన పరశును(గొడ్డలి), రక్తంతో తడిచి ముద్దయిన యుద్ధభూమిని, దూరంగా భీతితో చూస్తున్న సైన్యాన్ని పోస్టర్‌లో చూపిస్తూ కథపై మరింత ఆసక్తిని పెంచారు మేకర్స్. మహావిష్ణు అవతారాల నుంచి స్ఫూర్తి పొందిన ఈ కథ మోడ్రన్ విజువల్ వండర్‌గా, గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో అలరిస్తుందని మేకర్స్ చెబుతున్నారు. సామ్ సిఎస్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.

# గుజరాత్‌కు ఝలక్.. ముంబై ఇండియన్స్ విజయం



### ఐదు ఓటముల తర్వాత విజయం

### తిలక్ వర్మ సూపర్ శతకం

### 99 రన్స్ తేడాతో గుజరాత్ చిత్తు

**అహ్మదాబాద్:** ఎట్టకేలకు మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ విజయం రుచి చూసింది. గత నెల 29న తమ ఆరంభ మ్యాచ్‌లో నెగ్గిన ఈ జట్టు వరుసగా ఐదు ఓటములతో డీలా పడింది. ఇక ప్లేఆఫ్స్ అవకాశాలు కూడా ప్రమాదంలో పడుతున్న వేళ.. సోమవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో జూలు విదిల్చింది. పరుగుల కోసం ఇబ్బందిపడుతున్న తిలక్ వర్మ (45 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 101 నాటౌట్) కళ్లు చెదిరే శతకంతో అదుర్స్ అనిపించుకున్నాడు. అటు బౌలర్లు కూడా ముప్పేట దాడికి దిగడంతో టైటాన్స్‌పై 99 పరుగుల తేడాతో ముంబై ఘనవిజయం సాధించింది. ఇక హ్యాట్రిక్ విజయాలతో ఊపు మీదున్న గుజరాత్‌ను బ్యాటింగ్ వైఫల్యం దెబ్బతీసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగులు చేసింది. నమన్ ధీర్ (32 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 45) రాణించాడు. రబాడకు 3 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ తిలక్ వర్మ ఒక్కడి స్కోరును కూడా సాధించలేకపోయింది. అశ్వని (4/24) ధాటికి 15.5 ఓవర్లలో 100 పరుగులకే కుప్పకూలింది. సుందర్ (26) టాప్‌స్కోరర్. శాంట్నర్, ఘజన్‌ఫర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా తిలక్ నిలిచాడు.




**తొలి బంతి నుంచే తడబాటు:**

భారీ ఛేదనలో గుజరాత్‌కు తొలి బంతికే ఝలక్ తగిలింది. ఓపెనర్ సుదర్శన్‌ను గోల్డెన్ డకౌట్ చేసిన పేసర్ బుమ్రా ఈ సీజన్‌లో మొదటి వికెట్ తీశాడు. ఆ తర్వాత బట్లర్ (5), కెప్టెన్ గిల్ (14) కూడా నిరాశపర్చగా.. శాంట్నర్ ఎనిమిదో ఓవర్‌లో సుందర్, ఫిలిప్స్ (6)లను అవుట్ చేశాడు. దీంతో జీటీ 55/5 స్కోరుతో ఓటమి దిశగా పయనించింది. తెవాటియా (8), సుందర్ జోడీ కాసేపు క్రీజులో నిలిచి ఆరో వికెట్‌కు 24 పరుగులు జోడించింది. ఆ తర్వాత వరుస ఓవర్లలో పేసర్ అశ్వని.. తెవాటియా, రషీద్ (4), షారుక్ (17)ల పనిబట్టాడు.

తిలక్ హవా: ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్న తిలక్ వర్మ కసిదీరా బ్యాట్ ఝుళిపించాడు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి.. ఈ మ్యాచ్‌లోనూ శుభారంభం దక్కలేదు. రబాడ వరుస ఓవర్లలో వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచాడు. డానిష్ మలేవర్ (2) రెండో ఓవర్‌లోనే వెనుదిరగ్గా.. గత మ్యాచ్‌లో శతకం బాదిన డికాక్ (13)ను రిటర్న్ క్యాచ్‌తో రబాడ అవుట్ చేశాడు. అటు సూర్య (15)ను కూడా రబాడే అవుట్ చేయడంతో ముంబై పవర్‌ప్లేలో 46/3 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో నమన్ ధీర్‌కు తిలక్ అండగా నిలవడంతో నాలుగో వికెట్‌కు 52 పరుగులు జత చేరాయి. 13వ ఓవర్‌లో నమన్‌ను పేసర్ ప్రసిద్ధ్ అవుట్ చేశాక తిలక్ హవా ఆరంభమైంది. 15వ ఓవర్‌లో 6,4,4తో ఎదురుదాడికి తెర లేపాడు. అటు హార్దిక్ (15) మాత్రం షాట్లు ఆడలేకపోయాడు. రషీద్ ఓవర్‌లో 6,4 బాదిన తిలక్ 18వ ఓవర్‌లో పేసర్ అశోక్‌కు చుక్కలు చూపించాడు. వరుసగా 6,4,4,6,6తో 26 పరుగులు అందించాడు. అంతేకాకుండా 15 ఇన్నింగ్స్ తర్వాత ఫిఫ్టీ పూర్తి చేయగలిగాడు. అటు హార్దిక్‌ను సిరాజ్ అవుట్ చేయడంతో ఐదో వికెట్‌కు 81 పరుగుల తుఫాన్ భాగస్వామ్యం ముగిసింది. ఇందులో తిలక్‌వే 64 పరుగులున్నాయి. ఇక చివరి ఓవర్‌కు ముందు తిలక్ 80 రన్స్‌తో ఉండగా అతడి సెంచరీపై ఉత్కంఠ నెలకొంది. కానీ పేసర్ ప్రసిద్ధ్ వేసిన ఈ ఓవర్‌లో మరోసారి విరుచుకుపడి 4,6,6,4తో చివరి బంతికి ఐపీఎల్‌లో తొలి సెంచరీని నమోదు చేసి సంబరాల్లో మునిగాడు. తానెదుర్కొన్న తొలి 22 బంతుల్లో 19 పరుగులే సాధించిన తిలక్ ఆఖరి 23 బంతుల్లో 82 పరుగులు చేయడం విశేషం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.